# విరిగిన కలలు

★

♦ రచన : కుమారి కోనెలగుంట్ల అరుణ ♦



ఆకాశం మేఘులా వృతమై ఉంది. జోరుగా గాలి వీస్తూంది. చిన్న చిన్న వాన తుంపరులతో ప్రారంభమై కుండపోతగా వర్షం కురియ సాగింది. వీధి లైట్స్ ఆరిపోతూ వెలుగుతున్నాయి. జీవన్ గదిలో మాత్రం ప్రశాంతంగా బల్బు వెలుగుతూంది. టేబిల్‌కు దగ్గరిగా కుర్చీ లాక్కొని దీక్షగా వ్రాస్తున్నాడు. గాలి తాకిడికి తట్టుకోలేక కిటికీ రెక్కలు కొట్టుకుంటూ శబ్దం చేస్తూ దీక్షకు భంగం కల్గిస్తున్నాయి. దానికి తోడు గదిలో వెలుతురు కూడా మాయమయింది. లేచి తాపీగా సిగరెట్ ముట్టించి. క్రొవ్వొత్తి వెలిగించి తెచ్చి టేబిల్‌పై నుంచాడు. కిటికీ రెక్కలు మూసేందుకు వంగుతూ వీధిలోనికి చూచాడు. నిర్మానుష్యమయిన వీధిలో నిశాకనన విచ్చలవిడిగా సంచరిస్తూంది. ఆ క్రొవ్వొత్తి వెలుగులో ఎవరో యువతి తన గదికేసి వస్తూండటం చూచి మస్తిష్కంలో ఆలోచనలు సుళ్ళు తిరిగినాయి, జీవన్ ఆలోచనలను త్రెంపుతూ గది తలుపులు భళ్ళున తెరచుకొని ధవళవస్త్రాలతో, విరబోసుకున్న కుంతలాలుతో ఆ యువతి మెల్లిగా నడిచి వచ్చి జీవన్ కెదురుగానున్న కుర్చీలో కూర్చుంది. ఆమెను ఆపాదమస్తకం పరీక్షగా చూస్తూ ఏదో యోచిస్తున్నాడు. గదిలోని క్రొవ్వొత్తి వెలుగు ఆమెపై స్పష్టంగా పడ్తూంది. ఆమెను ఎప్పుడో ఎక్కడో చూచినట్టన్పిస్తుందే కాని (ఆమె ఎవరో) ఎంత యోచించినా సరిగా జ్ఞప్తికి రావటంలేదు. ఆమె తలెత్తి జీవన్‌పై వొక్కసారి చూచి గులాబి రేకులవంటి అధరాలను విప్పుతూ "మాస్టారూ, నా కథ వ్రాయరూ?" దీనంగా అంది. జీవన్‌కా కంఠ మెందుకో సుపరిచిత మన్పించిందే కాని ఎంత యోచించినా ఆమెవరో అంతు చిక్కటంలేదు. అతని సంశయానికి జవాబుగా "నేను మాస్టారూ, సుధను." ఆమె నేత్రాలు వేగంగా చలించాయి. అంతే! నల్భై ఏళ్ళ జీవన్ రెండు దశాబ్దల క్రిందట తన జీవితంలోనికి పరిగెట్టాడు. ఔను అప్పుడు సుధతో తను గడిపిన జీవితం కనులకు గట్టినట్టయింది. ఆనాటి సుధ చావు తలుచుకుంటే యిప్పటికీ శరీరం జలదరించి, ముచ్చెమటలు పోసి గుండె ఝల్లుమంటుంది. అంత భయంకరమయిన దామె చావు. "తడారిన కంఠంతో" అయితే సుధా, "నీవు మరణించలేదా?" అన్నాడు. సమాధానంగా సుధ పకపకానని నవ్వింది. మసక చీకటిలో ముత్యాలవంటి ఆమె పలువరుస కొద్దిక్షణాలు నక్షత్రాల్లా తళుక్కున మెరిసి

మాయమయినాయి. జీవన్ అలాగే కిటికీ నానుకొని ఆమెవంకే చూస్తున్నాడు. "మాస్టారూ! మీరు గొప్ప రచయిత. చావునుగూర్చి ఆత్మనుగూర్చి ఎన్నో నిరవచనాలు పాఠకలోకానికి అందించారు. ఆశలు తీరక మరణిస్తే తన ఆశలు నెరవేర్చుకోవటాని కవకాశము లేకపోయినా ఆశలను విఘ్నం కల్గించిన వారిపై పగ సాధించటానికే తిరిగి తను గడువు ముగిసే దాకా యిక్కడే సంచరిస్తుంటారని మీకు తెలియదా? మృధు మధుర గానాంబుధిలో తేలియాడలేని కలలు కన్నాను. కలలు నిజమవుతాయని ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. కాని, నా ఆశలన్నీ నిరాశలై, నా తీయని కలలన్నీ విరిగిపోయినాయి, మాస్టారూ, విరిగిపోయినాయి." ఆవేశంతో ఆమె తనువుకంపించిపోతూంది. ఆమె కనులు చింత నిప్పుల్లా మండుతున్నాయి. జీవన్ కెందుకో ఆమెకేసి చూచేందుకు ధైర్యం చాలడం లేదు. అయినా అతియత్నంమీద నిగ్రహించుకుంటూ ఆమె వంకచూచాడు. ఆనందం, భయం, ఆశ్చర్యం ఒకదాని తర్వాత ఒకటి చుట్టుముట్టాయి. "నీవా, సుధా, నన్ను క్షమించు" ఆవేశంతో అన్నాడు. సుధ సుందర వదనారవిందంలో క్షణం ఆనంద రేఖలు లాస్యంచేసి మాయమయినాయి. కనురెప్పలల్లాడిస్తూ "యిప్పటికైనా నన్ను గుర్తించినందుకు చాలా సంతోషం మాస్టారూ. నా కథ తప్పక వ్రాయండి. అదే నా కోరిక" అంటూ తన సమాధానానికి కూడ ఎదురు చూడకుండా గబగబ నడిచి చీకట్లో కలిసిపోతున్న సుధను తలుచుకుంటూ మౌనంగా యోచిస్తున్నాడు. అతని ఆలోచనలకంతరాయం కల్గిస్తూ బల్బు ప్రకాశవంతంగా వెలిగింది. వర్షం తగ్గి చిన్నగా తుంపరపడ్తూంది. చల్లగా ఈదురుగాలి వస్తున్నాయి. ఫ్లాస్కులోని వేడి పాలు కప్పులోనికి వంచుకొని త్రాగుతూ కొన్ని క్షణం మౌనంగా యోచించి, ఖాళీకప్పును టేబిల్పై నుంచి టేబిల్కు దగ్గరిగా కుర్చీలాక్కొని గత జీవితం కనుల ముందు మెదులుతుంటే ఆశక్తిగా వ్రాయటం మొదలుపెట్టాడు.

★ ★ ★

అతను నిరాడంబరమయిన తెల్లని దుస్తులలో పొగడ చెట్టు నానుకొనీ పరిసరాలనే విస్మరించి మురళి వాయిస్తున్నాడు. ఆ ప్రశాంత సంధాన సమయంలో చల్లని గాలిమధ్య మురళీగానం సుశ్రావనంగా విన్పిస్తూంది. మేతకొచ్చిన గోమాతలు ఆ సంగతే విస్మరించి గానానికి పరవశమయి తలాడిస్తూన్నాయి. అప్పుడప్పుడే లేతచిగురు కొమ్మలమధ్య అరవిచ్చి సౌరభం వెదజల్లుతున్న పూబాలలు గానానికి లయగా ఊగుతున్నాయి. శ్వేత వస్త్రాలలో పాలరాతి విగ్రహంగా భ్రమ కల్గిస్తూ

చిరకాల మన్నిక - అతి ప్రకాశవంతమైనది - నవీన పనితనము!

నోవెల్ వజ్రములు




నగలను అలంకరించుటకు.
విశిష్టతకు ప్రసిద్ధిచెందినది.
అన్ని విధముల్లైన కలర్ కమలములూ
మావద్ద దొరుకును.
మా వజ్రములకు గ్యారంటి ఇవ్వబడును.

: తయారించువారు :

NOVEL DIAMOND WORKS,
West Rani Street, : : Tiruchirapalli-8.

మురళీగానానికి పరవశురాలై అరమోడ్పు నేత్రాలతో నిల్చుంది సుధ. గాలికి నల్లని ముంగురులు చెదిరి తెల్లని నున్నని ఆమె నుదటిమీదికి ముచ్చటగా పడుతూ లేస్తున్నాయి. వదిలివేసిన పైట చెంగుగాలికి రెపరెప లాడుతూ వింతశబ్దాన్ని కల్గిస్తూంది. ప్రకృతినే పరవశింపచేసిన మురళీగానం మెల్ల మెల్లగా ఆగిపోవటంతో సుధ జాగ్రదావస్థలోనికి వచ్చి చుట్టూచూచింది. చీకటి మసకగా అలుముకుంటున్నది. పక్షులు కలకల రవాలతో గూళ్ళు చేరుకుంటున్నాయి. గోకాపరి చిన్నగా కూనీరాగం తీస్తూ గోవులను తోలుకుంటూ ఊరిదెసపోసాగాడు. సుధ ఎండిన ఆకులపై శబ్దంచేస్తూ నడిచి వచ్చి జీవన్ కభిముఖంగా కూర్చుంది. తలెత్తి చూచి మురళి సవరించ సాగాడు. "మాస్టారూ మీ గానం ఈవేళ చాలా అద్భుతంగా సాగింది. నిజంగా మీ గానంలోని మధురిమ అస్వాదిస్తుంటే ఈ జీవితమే అక్కర్లేదనిపిస్తుంది. గానం అనేది ఒక మహత్తరమయిన వరం. అది అందరికి లభించదు. మీవంటి అదృష్టవంతులకు మినహా. ఏమయినా మీ గానం వింటుంటే అలా పరవశమయిపోతుంటాను. నిజంగా మీ గానం మరిమరి వినాలనిపిస్తుందంటే నమ్మండి." ఆవేశంతో అంది. జీవన్ చిన్నగానన్ని "మీరు నిజం చెప్తున్నారా?" అన్నాడు. సుధ చురుగ్గా చూచి, పొగడటం నాకు చేతకాదు. ఏ విషయమయిన మనసులో కలిగిన భావాలను ఆప్తులవద్ద సూటిగా నిస్సంకోచంగా చెప్పటం నాకలవాటు. మీరలా భావిస్తున్న పక్షంలో నేనేమిచేయలేను" అంది. సుధ నిష్కల్మష వాక్కులకు జీవన్ హృదయం పులకించింది. మధురమయిన మందహాసంతో తలెత్తి "సుధాదేవిగారూ, నా మురళీగానాన్నిగూర్చి ఆదిలో అభినందించి ప్రోత్సాహించటం మీరే. నా గానాన్ని ఇదివరలో విన్న కొందరు తేలికగా తీసివేసి నిరుత్సాహ పరిచి పిచ్చి అలవాటు క్రింద తీసివేసినవాళ్ళే. కాని ఎవరెన్ని అనినా నా ప్రాణమయిన మురళిని మాత్రం అశ్రద్ధ చేయలేకపోయాను" నిట్టూరుస్తూ అన్నాడు. "మాస్టారూ. ఏదైనా ఒక మంచిపని కాని చెడుపని కాని మనం తలపెట్టినప్పుడు దానిని ప్రోత్సాహపరిచి అభినందించేవారికంటే నిరుత్సాహపరిచి హేళన చేసేవారే ఎక్కువగా అగుపిస్తుంటారు. అంతమాత్రానా మనం తలచిన పనిని నిరుత్సాహంతో వదలక ధైర్యంతో సాధించాలి. అసలు కళలనేవి పూర్వజన్మ సుకృతం. అలాగే కళలోని మాధురానన్నీ అనుభవించి అర్థంచేసుకొనగల పిపాస చాలా కొద్దిమందికి మాత్రమే ఉంటుంది. కళలు అందరిలోనూ ఉండనట్టే కళలోని మాధుర్యాన్ని అనుభవించే శక్తి అందరికీ ఉండదు. కళారాధకులు తమలోని కళను అజ్ఞాతంగా దాచుకోక అభిరుచిగల వాళ్ళకు ధారపోయాలి. అదే కళయొక్క ప్రయోజనం. అనాడే కళలన్నీ విశన శ్రేయస్కరం అవుతాయి" అంటూ ఆపి తిరిగి "ఏమయినా అశ్రద్ధ నిరుత్సాహం చేయకుండా మీలోని కళకు చక్కని మెరుగులు దిద్దినందుకు చాలా సంతోషం. కళలోని మాధుర్యం అర్థం చేసుకునే ఉన్నత సంస్కారం చాలా కొద్దిమందిలో

Tel : Export Phone : 21443

ఏనుగు బ్రాండ్

CARNATAKA KNITTING COMPANY
INDIA
CKC

"సి. కె. సి." బనియన్లు
ధరించుటకు హాయినిచ్చును.
అన్ని చోట్ల దొరుకును.

తయారించువారు :

The Carnataka Knitting Co.
Post Box No. 252
TIRUPUR - 638602.

ఉంటుందనే నా అభిప్రాయం మరి మీరేమంటారు?" క్రీగంట జీవన్ వెసచూస్తూ అంది. "నిజం చెప్పారు, కళలను అర్థంచేసుకొని ఆదరించటానికికూడా సంస్కారం ఉండాల్సిందే" అన్నాడు.

సుధ మౌనంగా ఆలకిస్తూ వినీలనీలాకాశంలోని తారకల వంక చూస్తూంది. జీవన్ హఠాత్తుగా ఆమె వంక చూచాడు. తెల్లని పసిమి ఛాయ గుండటి వదనం, కలువరేకులతో పోటిచేసే పోగ కనులు, నూవు పూవును బోలిన నాశిక, చిన్న మూతి, రోజారంగు పలుచని అధరాలు, చాలా అందమయిన విగ్రహమే సుధ. కొద్ది నెలలక్రిందటనే ఈగ్రామానికి స్కూల్ టీచరుగా వచ్చింది. ఆమె సౌందర్యానికి ఈ గ్రామ పెద్దలు కొందరు మూర్ఛపోయారన్న అతిశయోక్తి కాదు. హెడ్ మాస్టారుసైతం సుధ అంటే పంచప్రాణాలు వదుల్తాడు. ఆమె తీయని ఒక పలుకుకోసం అందరూ అహర్నిశలు ఎదురుచూస్తుంటారు. కాని సుధ విచిత్ర వ్యక్తి ఎవరితోనూ ఎంతో అవసరమొస్తే మినహా మాట్లాడదు.

ఆమె మౌనాన్ని కొందరు గర్విష్ఠిగా అంచన వేయక పోలేదు, తను అలానే భావించాడు, కాని ఒకనాడకస్మికంగా ఆమె తన మురళీ గానాన్ని ఆలకించి తన నమితంగా ప్రశంసించటం జరిగిపోయినాయి. ఆనాటినుంచి సుధ తనతో స్నేహంగా కలిసిమెలసి తిరగటం చూస్తున్న తోడి అసూయపర్లు మా పవిత్ర స్నేహానికి నీచమైన నిందను కల్పించారు. అమాయకురాలయిన సుధ ఆ నిందను గమనించలేదు. ఈ సంగతి సుధ అంత పట్టించుకోవటం లేదు. కాని "తన స్నేహంనుంచి సుధ జీవితం అపనిందలపాలు కాకూడదు యిప్పటికైన ఈ స్నేహాన్ని త్రెంచటం యుక్తం" ఆ నిర్ణయానికి వస్తూనే జీవన్ "సుధాదేవి మీరు అన్యదా భావించనంటే ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను" ఆపి సుధ వంకచూచాడు. సుధ తలక్రిందికి వాల్చి "అదేమిటి మాస్టారూ, అలా సందేహిస్తున్నారు, నా దగ్గర సంకోచం ఎందుకూ? చెప్పండి" జాలి స్వరంతో అంది.

జీవన్ కొన్నిక్షణం మౌనం దాల్చి తిరిగి "సుధా మీరు చాలా అమాయకం. పైపెచ్చు లోకానుజ్ఞానం భావంలేని పిన్న, జీవితం అమూల్యమయినదని మీకు తెలియదు, మీరు పవిత్ర ఆదర్శంతోనో, ఉన్నత ఆశయంతోనో స్నేహంచేసి పవిత్రంగా ఉంటున్నా ఈ సంఘం నమ్మదు, పైపెచ్చు లేనిపోని నిందను సృష్టించి మీ భావి జీవితానికే కళంకం తెస్తూ, అంతేకాక సుందరమయిన మీ జీవితాన్ని వికృతంగా మార్చివేస్తుంది, ఆడదాని జీవితం అరిటాకువంటిది, అరిటాకు పోయి ముల్లుమీద పడ్డా, ముల్లువచ్చి అరిటాకుమీదపడ్డా నష్టపోయేది అరిటాకే కదా? నా స్నేహం మీకు మచ్చ గల్గిస్తే అది మీ భావి జీవితానికే ఎంతో నష్టం, నిదానంగా యోచించండి" అన్నాడు. ఆ మాటలకు సుధ సుందర వదనారవిందంలో క్షణకాలం చిఱునవ్వొన తొంగిచూచి మాయమయింది. "మాస్టారు ఇదేనా మీ భయం? సంఘం, సంఘం సంగతి మీకు తెలియదా? మంచిచెడ్డలను నిర్ణయించేది విధాత కాని ఈ సంఘం కాదే? ఈ సంఘం ప్రతి వ్యక్తిని తన చెప్పు చేతులలో నుంచుకొని తన ఆజ్ఞప్రకారం నడిపించాలని శత విధాలా ప్రయత్నిస్తుంది, తనకు లొంగినవారిని సాదరంగా ఆహ్వానించి తనకుక్ళులో చేర్చుకుంటుంది. ఎదురు తిరిగినవారిని తన వక్రచూపులతో నఖశిఖ పర్యంతం పరీక్షగా చూస్తూ లేశమాత్రం దోషం కన్పించినా తన కబంధ హస్తాలతో నలిపివేయలనే తీవ్రమైన కాంక్షతో ఉంటుంది. మాస్టారూ! దారినిపోతుంటే ఎన్నో ముళ్ళు గ్రుచ్చుకొని బాధిస్తాయి. వాటిని ఓర్పుతో తీసివేస్తూ సాగినప్పుడే మనం గమన స్థానం చేరుకో గలిగేది. మంచి ప్రక్కనే చెడు. వివేకానందస్వామి అన్నట్టు "మంచి - చెడు ఒకే నాణమునకు యిరు ప్రక్కల వంటివని; ఒకే దివసమునకు రేయింబవళ్ళవంటివని" మన స్నేహం మంచిగా సాగుతున్నా చెడుప్రచారం దానివెంటనే తప్పక ఉంటుంది. ద్వేషానికి ప్రేమకు ఎంత సన్నిహిత, తత్వమో అలానే మంచికి - చెడుకు కూడా. అలాంటప్పుడు మనం బాధపడటం అవివేకమే ఔతుంది" ఆవేశంతో సుధ అధరం వొణికాయి. "సుధాదేవిగారూ మీ మాటలలో కొన్ని యథార్థమైనా మరికొన్ని విషయాలు నే నంగీకరించను. మన సాంప్ర

# "SELEKT"
## MOTORS & PUMPS



For :-- EFFICIANCY, ECONOMY AND TROUBLE FREE SERVICE




Manufactured by :

## CHITRA INDUSTRIES

COIMBATORE - 641005.

Grams : "SELECT PUMP" Phone : 24548

: సేల్స్ బ్రాంచ్ :

## చిత్రా ఇండస్ట్రీస్

5-1,446, రాణిగంజ్

సికిందరాబాద్-3(ఎ.పి.) ఫోన్ : 77826

డిస్ట్రిబ్యూటర్స్ :

## లక్ష్మీ ఏజెన్సీస్

రాణిగంజ్ : : సికిందరాబాద్-3


దాయం ప్రకారం అనాదినుంచి స్త్రీ పురుషులు మైత్రి అసంభవం. ఒకవేళ సంఘాన్ని నాగరికంగా మార్చాలని తాపత్రయపడి కొందరు ఎంతో పవిత్రమైన స్నేహాలతో ఉండి చివరికవి తమ భావిజీవితాలకే మాననిమచ్చయై పతనమైపోయారు. మన సంఘం బాహ్యంగా మారిపోతూందే కాని అంతరంగికంగా మారిపోవటం లేదు, అదే చిక్కు. ఏ సిటీలోనైతే అంత పట్టింపు లేదు. కాని యిటువంటి చోట్ల ఈ స్నేహం నిద్దూరంగా ఉంటాయి. అంతేకాక హాస్యాస్పదంకూడా ఔతాయి" కఠినంగా చెప్పాడు.

ఆ పదునైన వాక్కులకు సుధ వదనం తెల్లగా పాలిపోయింది. అప్రయత్నంగానే కన్నీరు ఉబికింది. అతి యత్నంమీద అధరాలను తడిచేసుకుంటూ "మాస్టారూ మీరుకూడా సమాజానికి పిరికిగా తల వంచుతురా? చదువుకొన్న మీరే యిలా వెనుకంజవేస్తుంటే యిక మిగిలినవారి. ననుకోవటం పొరబాటే. మన హృదయాలు పారిశుధ్యమైనప్పుడు మనం విధాతకుకూడా జంకవలసిన పని లేదు. నిప్పును తాకి భరించే శక్తి ఒక్క నీటికే ఉంది. కాని మిగిలిన నేవైన తాకితే రూపాలులేకుండా నశించిపోతాయి. అలానే మనలాంటి పవిత్ర స్నేహాన్ని అర్థంచేసుకునే శక్తి ఉన్నత మనస్సులకేకాని అల్ప నీచ మనస్తత్వాలకు కాదు" అంటూ ఆపి కనులలో నిండిన కన్నీటిని తుడుచుకుంటూ తిరిగి "మాస్టారూ, ప్రతి వ్యక్తికి ఒక్కొక్క రకమైన వస్తువులమీద ఒకరకమైన విచిత్రాకర్షణ అభిమానం మమత పెనవేసుకుపోయి వుంటావేమో, మురళీ అంటే ప్రాణం. ఏజన్మ బంధమోనన్పిస్తుంటుంది. పసితనంనుంచి ఈ మురళీగానం అంటే చెప్పలేని మమత. గానం అంటే ఏమిటి నిర్వచనం తెలియని ఆ రోజులలోకూడా ఎక్కడైన మురళీగానం తీలగా విన్పిస్తే చాలు. పరిగెత్తి వెళ్ళి విని పారవశ్యం చెందేదాన్ని. ఒక్కరోజు ఆ మురళీగానం ఆలకించకపోతే మనసంతా వ్యథ పూరితంగా ఉండేది, భగవంతుడెందుకీ చిత్రమనస్తత్వాన్ని యిచ్చాడో కాని అది నా పాలిటి జ్వాలయై నన్నుదహించి వేస్తుంది. మాస్టారూ! ఈ తావులో నేనొక లతాంగినై; లేదా మీ మురళి అయిఉంటే ఈ మానసిక వ్యథ ఉండేది కాదేమో? అ...బ్బా మాస్టారూ మీ

గానం వినకుండ నేనెలా జీవించేది, చెప్పండి" పగులుతున్న హృదయాన్ని చేత్తో పట్టుకొని బాధతో నేత్రాలు మూసుకుంది సుధ. మూసిన నేత్రద్వయాల నుండి జలపాతాల్లా కన్నీరుకారి ఆమె వక్షో పరిభాగంపై ధారగాపడ్తున్నాయి. అసలీ ఈరోజు నిండు పౌర్ణమి. శశాంకుడు మబ్బుల చాటునుంచి బయటపడి తన వెన్నెల కాంతులను జగమంతా ప్రసరింపచేస్తాడు. ఆ ప్రదేశమంతా వెన్నల కాంతులతో తెల్లగా మెరిసిపోతూ మనోహరంగా ఉంది. దానికి తోడు చల్లగా వీచే మలయ...సూరభం వెదజల్లే కుసుమ బాళలు. విషాదమూర్తిలా కూర్చున్న సుదను చూచి జీవన్ కలవరపడ్డాడు. తననుంచి సుధ హృదయం ఎంత గాయపడిందో? నిజంగా కొందరి హృదయాలు చాలా సున్నితం. ప్రతి చిన్న బాదనైనా నిగ్రహించుకోలేదు. ఛీ! ఈరోజు ఎంత పౌరుషంగా మాట్లాడి ఆమె సున్నిత హృదయాన్ని గాయపరిచాను. సంఘమా? సుదనా తనకు ముఖ్యం. నిజంగా సుద అంటే తనకు ప్రాణం. మరి అటువంటి ప్రాణమైన సుధే తనముందర విషాదమూర్తిలా ఉంటే భరించగలడా? అంతే.

అప్రయత్నంగానే జీవన్ చేయి సుద చెంపలమీదుగా కారుతున్న కన్నీటిని మెదువుగా తుడిచివేసింది. "నన్ను... ఈ మూర్ఖుని క్షమించు సుధా..." జాలిగా పలికింది జీవన్ కంఠం. సుధ నివ్వెరబోయి అంతలోనే తేరుకొని పట్టులేని ఆనందంతో "మా...స్టా...రూ" అంటూ కన్నీరు తుడుస్తున్న జీవన్ చేతిని గట్టిగా పట్టుకొని దానిని కళ్ళకద్దుకుంది. జీవన్ ఆశ్చర్యపోయాడు. హఠాత్తుగా జరిగిన ఆ సంఘటనకు క్షణం యిరువురూ సిగ్గుతో తలలు వంచుకున్నారు.

సుధ మెల్లిగా తలయెత్తి "మాస్టారూ, నాదొక కోరిక తీరుస్తారు కదూ...". క్రీగంట చూస్తూ అంది. సిగ్గుతో తలయెత్తలేక 'ఏ...మి...టి' అస్పష్టంగా అతని పెదవులు కదిలాయి. హఠాత్తుగా సుధ అతని


మా హృదయపూర్వకమైన దీపావళి అభినందనలు!




మేలైన పొగాకుతో, అత్యుత్తమమైన ఆకులతో, నిపుణులైన పనివారులచే తయారుచేస్తున్నాము.

★

మల్లిస్సేరి బీడీలు

అత్యుత్తమమైనదని లక్షలాది ప్రజలు వాడుతున్నారు.

★

Grams: "MALLISSERI" Phone: 24031

**Mallisseri Beedi Works**

**Sullivan Street, Coimbatore - 641001**

O.S.R.

ఎదపైవాలి "నన్నిలాగే మీవద్ద ఉంచుకునే భాగ్యం ఈ దీనురాలకి కల్పించండి, అదే మీ సుధ కోరిక" అంది. జీవన్ అప్రతిభుడైపోయాడు. అదృష్టమనేది చాలా చిత్రమయినది. ఏనిమిషానికి ఎవరిని వరించేది తెలియదు. తననుగూర్చి తపస్సు చేసేవాళ్ళదగ్గరికి లీలగాకూడ వెళ్ళదు.

ఎప్పుడూ దురదృష్టాన్ని విషాదాన్ని కోరే వ్యక్తులనే అది వరిస్తుంది. కాని వచ్చిన అదృష్టాన్ని పిచ్చివారిలా చేతివ్రేళ్ళ సందులలోనుంచి మంచు బిందువులలా జారవిడుచుకోక దానిని రత్నాల్లా తెలుసుకొని బిగియారా బంధించటం వివేకవంతుల లక్షణం. అదిగ్రహించిన జీవన్ అందిన అదృష్టాన్ని జారవిడుచుకోలేక పోయాడు. తన బలిష్ఠమయిన బాహువులలో సుధను బంధించి "సుధా...ఈ అభాగ్యునికి ఎందుకింత గొప్ప వరం ప్రసాదించావు" మాటలు పూర్తికాక మునుపే సుధ జీవన్ నోటిమీద వ్రేలుంచి "తప్పు, అలా అనకండి మాస్టారూ. ఏ జన్మానుబంధంవలనవో చిత్రంగా మనబంధం కలిసిపోయింది, కాదనకండి. త్వరలోనే ఆ దేవదేవుని సాన్నిధ్యంలో మన వివాహం జరిపించుకుందాం. మిమ్ములను చూచిన తొలిసారే నాలో ఎదో తెలియని తీయని కోరిక రేకెత్తింది. అది యింత త్వరలో నెరవేరుతుందనుకోలేదు. ఏమైనా రేపటినుంచయినా మీ గానం హాయిగా వినే అదృష్టం కల్గుతుంది. అదే నా వాంఛ" ఆనందంతో సుధ అతని ఎదలో తల ఆన్చి నేత్రాలు మూసుకుంది.

జీవన్ ఆమె ఎర్రని అధరాలను స్పృశిస్తూ ఎదో మధురానుభూతిలో కొన్నిక్షణాలు తేలిపోయాడు. సుధ అతని కౌగలినుంచి విడివడి "మాస్టారూ... వెళ్తాను..." ఓ.కే. అన్నాడు...వస్తా...ఛీరియో" అని ముందుకు సాగుతూ అంది. చీకటిలో కలిసిపోతున్న సుధ వంక కొన్నిక్షణాలు అయోమయంగా చూస్తూ నిల్చున్నాడు. అదృష్టం, దురదృష్టం...ఒకటి వెలుగయితే మరొకటి చీకటి. వెలుగు చీకటి రెండు మిశ్రమమయినట్లే అదృష్ట దురదృష్టాలుకూడా. క్షణకాలపు అదృష్టానికి పొంగిపోయే మానవుడు దానివెనుకే వచ్చే దురదృష్టాన్ని గుర్తించలేకపోతున్నాడు పాపం. అదృష్ట దురదృష్టాలు చిత్రమయినవి. దురదృష్టం కలవంటిదైతే అందులో రంగురంగుల తీయని కలల అదృష్టం. రంగులకల అనే అదృష్టం కరిగిపోతే మిగిలిపోయేది శూన్యమయిన కలనే...అదికూడా శాశ్వతం కాదు. కనుకనే రెండూ అశాశ్వతమే!

★ ★ ★

విధి చాలా చిత్రమయినది. అది ఏ నిమిషానికి ఏ విధంగా పరిమణిస్తుందీ చెప్పటం మహామహులకు కూడా అసాధ్యం. కనుకనే శ్రీరాముడంతటివాడు విధికి లొంగిపోయి కష్టాల పాలయాడు. అందుకే "విధి విడ్డూరం, విధి విపరీతం" అన్నారు. క్షణకాలం క్రిందట వికసించి కన్నునిసూరభం వెదజల్లే కుసుమబాల ప్రచండమయిన పెను తుఫానువలన ముగ్గగా నేలరాలి మట్టిపాలయి నామరూపాలు లేకుండా నశించవచ్చు. విధి లీల తెలియని అమాయకులు ఎన్నో ఆశిస్తుంటూ తము అనుకున్నవి అన్నీ జరిగి తీరుతాయ

మీ...
మనోల్లాసమునకు




మెర్రి బనియన్లనే
ధరించండి
ఏజెంట్లు లేని ఊళ్ళలో ఏజెంట్లు కావలెను.
— వివరాలకు —
MERRY KNITTING CO.
TIRUPUR - 638604.

భ్రమిస్తుంటారు. కాని విధి వక్రించి జీవితాలు బలమయిన శాపాలకు గురియైనప్పుడు మన కలలన్నీ కలలయి ఆశ నిరాశల మధ్య ఊగులాడుతూ శూన్యంగా మిగిలిపోతాం. ఈ సత్యం తెలియని జీవన్ నిన్నటి మధుర సంఘటనకు అదృష్టమనే రంగులుపూసి 'ఆశ' అనే ప్రతిమను సృష్టించుకొని 'వాంఛ' అనే మధుర భావనలలో నిలువుటద్దంముందు నిల్చొని ' చిన్నగా కూనిరాగం తీస్తూ క్రాప్ దువ్వుకుంటున్నాడు. క్రాప్ దువ్వటం పూర్తిచేసిన జీవన్ వెనుతిరిగి నిర్విణ్ణుడైపోయాడు. అది కలో భ్రమనో అతనికిదేమీ అందలేదు. రేగినజుత్తు...వాడినపూలు... చెదిరి ఎర్రగా నుదురంతా రక్తంలా అలుముకున్న తిలకం...చిరిగినరవిక...నలిగిన చీరతో మత్తుగా జోగుతూ కనులను మోడ్పులుచేసి తనవంకే చూస్తున్న సుధను యిక చూడలేకపోయాడు. కొన్నికొన్ని సత్యాలు ఒకరు విడమరిచి చెప్పకపోయినా వాటికవే స్పష్టమౌతాయి. సుధకు జరిగిన అవమానం గ్రహించి సూటిగా ఆమెను ప్రశ్నించలేకపోయాడు.

ఒక్కొక్కసారి తెలిసిన నిజాలుకూడా పైకి చెప్పలేక ఏమీ తెలియని వారిలాగా వొట్టి అమాయకులుగా నటించాల్సి వస్తుంది. అటువంటి పరిస్థితులలో అదే శ్రేయస్కరం. జీవన్ అదే స్థితిలోనికివచ్చి "సుధా... ఏం జరిగింది" అతని అధరాలు అప్రయత్నంగానే వొణికాయి. తలుపురెక్కను పట్టుకొని నిలద్రొక్కుకున్న సుధ ఆ ప్రశ్నకు విషాదంగా నవ్వి "ఏం జరగరాదో అదే జరిగిపోయింది" అంది. ఆ మాటలు అశ్వపాతంలా తగిలాయి జీవన్‌కు. అయిన తన బాధను అతియత్నంమీద అణుచుకుంటూ "సుధా...ఈ అవమానాన్ని భరించలేక బహుశా నీవేమయినా...జీవన్ మాటలు పూర్తికాకమునుపే సుధ అందుకుంటూ "మాస్టారూ, స్త్రీకి శీలంకన్న మరో ఆభరణం లేదు. శీలం పోయిన స్త్రీ బ్రతికిచచ్చినవారితో సమానమే అవుతుంది. స్త్రీ అంటే ఏమిటనుకున్నారు? స్వచ్ఛమయిన అద్దంవంటిది. దానిపై మరకలు పడితే శుభ్రంగా తుడుచుకోవచ్చునేమో కానీ విరిగిపోతేమాత్రం అతికించటం దుర్లభం. నా జీవితమనె అద్దంకూడా పగిలిపోయింది.

పగిలిన అద్దం అందంలేనట్లు, శీలంలేని స్త్రీ బ్రతకటం


# శుభవార్త!
# 'ఎస్' బీడీల ఎగుమతి




కెనడా, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, అమెరికా మున్నగు అనేక దేశాలకు మెస్సర్సు ఎ. హబీబుర్ రహమాన్ అండ్ సన్సు, గుడియాత్తంవారు ఉత్పత్తి చేయు 'ఎస్' బీడీలు ఎగుమతి ఔతున్నాయి. అంతేకాదు. అనేక ఇంటర్నేషనల్ ఫైర్సులో వీటిని ప్రదర్శనమునకు పెట్టారు. జర్మనీ (లిప్‌జిగ్ ఫైర్) స్వీడన్, బెల్జియం, సింగపూర్ మున్నగు దేశాలలోనే కాక, అనేక ఆఫ్రికన్ దేశాలలోని ప్రదర్శనాలలోకూడా వీటిని ప్రవేశ పెట్టారు. 'ఎస్' బీడీలకు వారు తయారుచేసిన 20 శాత్రీలు గల సిగరెట్ పెట్టెవంటి పాకెట్లో క్రొత్త రూపు, అందచందాలుకూడా ఏర్పడ్డాయి.

ఆద్యంతన భవిష్యత్తులో అమెరికా, యూరోపు ఖండాలలో నాగరిక ప్రజలలో సైతం అభిమానులను పెంచుకొని 'ఎస్' బిడి సుస్థిరమైన స్థానం ఆక్రమించగలదను నమ్మిక ఏర్పడ్డది. ప్రాచ్య ప్రాశ్చాత్య దేశాలలో లభించిన విశేష ప్రోత్సాహం దానిని దృఢపరుస్తున్నది.

కూడా దుర్లభమే. కనుకనే నా జీవితానికి ముగింపు చేసుకున్నాను...'' అంది. జీవన్ ఆ మాటలకు ఒక్కసారిగా వొణికిపోయాడు. అదేమి గమనించని సుధ తూలుతూనే లోనికివచ్చి మూలనున్న కుర్చీలో కూర్చొని నేత్రాలు మూసుకొని "మాస్టారూ, బాల్యం అంతా ఒక సుందరమయిన కల అని కవులు వ్రాస్తుంటారు. కాని నా పాలిటమాత్రం బాల్యం అంతా ఒక భయంకరమయిన పీడకలనే. చిన్ననాడే తల్లితండ్రుల ఆదరణ శూన్యమయి అత్తమామ విదిలింపుల చీదరింపుల మధ్య పెరిగి పెద్దదానినైనా ఎలాగో స్కూల్ ఫైనల్ ట్రైనింగ్ పూర్తిచేసి టీచరుగా యిక్కడికి వచ్చాను. కాని ఈ ప్రపంచంలో, దేశంలో స్త్రీకి ఎంత విలువ ఉందో అర్థంచేసుకోగల్గాను. ఇక్కడికి మధుర భావానలతో అడుగిడిన నేను ఈ స్కూల్లోని ఇతర టీచర్స నీచమయిన గుణాలు గమనించి నిస్పృహ చెంది జీవితమంటే బాధగా అన్పించింది, కాని బీటలు వారిన భూమికి వర్షపు ఝల్లుకురిసినట్లుగా నా జీవితంలోనికి మీరు ప్రవేశించారు. మన స్నేహానికి నాంది మీ మురళీయే. మీ గానం విన్నతర్వాత నా కెందుకో జీవితంపై మమతను కల్గింపచేసింది. ఆ గానం అలా వింటూ ఉండిపోతే నాకీప్రపంచమే అనవసరమన్పించేది. మాస్టారూ... గానం అనేది ఒక మహత్తర శక్తి. ఎటువంటి బాధలను భరిస్తువున్నవారికైనా తీయని గానం విన్పిస్తే తాగినవారిలా మైమర్చిబోతారు. గానంకున్న శక్తి అలాంటిది మరి. మీ పాదదాసిగా నిలిచిపోయి మీ మురళీ గానంలో ఓ రేఖనైపోవాలని, మీ అమాయక కనులలో కను పాపలుగా మెరియాలని ఎన్నెన్నో కలలు కన్నాను...కాని నా కలలన్నీ యిలా విరిగిపోతాయని అనుకోలేదు. కాని ... మాస్టారూ, మానవుడు దేనినైనా జయించగల్గుతాడేమో కాని విధిని మాత్రం జయించలేడు. ఏతపనశాల్తో నా తీయని కలలు విరిగి నా జీవితం యిలా విరిగిపోయింది'' సుధ రెండు చేతులలో మొహం దాచుకొని వెక్కి వెక్కి ఏడ్చింది.

జీవన్ కరిగిపోయాడు. అప్రయత్నంగానే అతని నేత్రాలలో రెండు నీటి బిందువులు నిలిచాయి. అతనిలో ఏదో ఆరాటం కలుగసాగింది. సుధ ఆత్మ అగ్నిలా పవిత్రమయిన శరీరాన్ని కాలుతుందా? అంతే! జీవన్ సుధ దగ్గరిగా వచ్చి, సుధా...బాధపడకు...నిన్ను స్వీకరించటానికి నాకేం అభ్యంతరం లేదు. అన్నట్టు నిమిషంలో నేను డాక్టర్ను పిలుచుకువస్తాను...'' అంటూ రెండు అడుగులు ముందుకు వేసాడో లేదో సుధ గంభీరస్వరం విన్పించింది.

"మాస్టారూ, అనవసరంగా శ్రమ తీసుకోకండి. అయిన మీ పిచ్చిగాని శారీరక బాధలకయితే డాక్టర్ కాని, మానసిక బాధలకు డాక్టర్ ఏంచేయగలడు? అయినా నేను జీవించేది కొద్దిగంటలు మాత్రమే. ఈ అమూల్యమయిన కాలాన్ని వ్యర్థపుచ్చక మీ మధుర మురళీ గానం ఈ అభాగ్యురాలకి విన్పించే సదవకాశాన్ని కల్పించండి!'' అంది. జీవన్ కేమిచేయాలో పాలుపోలేదు. అర్థంకాని అయోమయావస్థలో బిగ్గరగా "సుధా...నీవు జీవించాలి...నీకోసం ఏమయినా చేస్తాను'' ఆవేశంతో అరిచాడు. (సశేషం)

మా హృదయపూర్వకమైన దీపావళి అభినందలు!

ఎల్లప్పుడూ "ఉషా" బనియన్లనే వాడండి!!

